క్లుప్తంగా

లబ్ధిదారులు ఇళ్లు వేగంగా నిర్మించుకోవాలి

● హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసరావు

కురిచేడు: పక్కా గృహాలను లబ్ధిదారులు వేగవంతంగా నిర్మించుకునేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని పడమర గంగవరం, పొట్లపాడు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి వివిధ దశల్లో ఉన్న ఇళ్లను పరిశీలించారు. గృహనిర్మాణ శాఖ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు త్వరగా పక్కా గృహాలు పూర్తి చేయాలని సూచించారు. వీరి వెంట హౌసింగ్ డీఈ నిరీక్షణరావు, ఇన్‌చార్జి ఏఈ బి.మనోహర్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మరియదాసు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెద్దదోర్నాల: మండలానికి సంబంధించి 2024–25 సంవత్సరానికి మంజూరైన బీసీ కార్పొరేషన్ రుణాల కోసం బీసీలు, ఈబీసీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నాసర్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలోని బీసీలకు 23 యూనిట్లు, ఈబీసీలకు 11 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు.

రెండు బైకుల ఢీ.. ఇద్దరికి గాయాలు

దొనకొండ: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొచ్చెర్లకోట–గుండ్లకమ్మవాగు సమీపంలో మంగళవారం జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. కంభంపాడు గ్రామం నుంచి కొచ్చెర్లకోటకు క్రాంతికుమార్ బైకుపై వెళ్తున్నాడు. దొనకొండ నుంచి దొర్నాలకు సురేష్ మరో బైకుపై వెళ్తుండగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు క్షతగాత్రులను తరలించారు. వారికి సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు.

టీకాపై అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్వేత

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్లో డాక్టర్ మౌనిక అధ్యక్షతన ఆశా కార్యకర్తలకు టీకాపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీమకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ డి.శ్వేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు గవర్నమెంట్ హాస్పిటల్లోనే కాన్పులు జరిగేలా చూడాలన్నారు. 0 నుంచి 5 ఏళ్లు కలిగిన చిన్న పిల్లలకు టీకా అందేలా చూడాల్సిన బాధ్యత ఆశ కార్యకర్తలదేనని ఆమె తెలిపారు. గర్భిణులకు పౌష్టికాహారం గురించి సలహాలు ఇవ్వాలని, ప్రజలకు అత్యవసర సమయాల్లో కూడా అందుబాటులో ఉంటామని గవర్నమెంట్ హాస్పిటల్స్ సేవల గురించి వివరించాలని తెలిపారు. డీపీఎంవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ లెప్రసీ కుష్ఠువ్యాధితో బాధపడుతున్న వారికి పెన్షన్ సమయానికి అందేలా చూడాలని సూచించారు. డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఈఓ కె.చంద్రశేఖర్, సుశీల, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు


ట్రాఫిక్ నిబంధనల బోర్డు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఎస్సై అహరూన్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, హెల్మెట్ పెట్టుకోక పోయినా, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే అమలు పరిచే శిక్షలు, జరిమానాలు తెలిపే బోర్డులను ట్రాఫిక్ ఎస్సై అహరూన్ మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. కాలేజి రోడ్డు, పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, సెవెన్ హిల్స్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అంతర్గత రోడ్లతో అవస్థలు



● చిన్నపాటి వర్షానికే బురదమయం
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
● పట్టించుకోని సంబంధిత అధికారులు

తాళ్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. శివారు గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఈ రోడ్లలో ప్రయాణం నరకయాతనగా మారుతోంది. వాణిజ్య రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తూర్పు గంగవరం నుంచి తాళ్లూరు.. అక్కడి నుంచి గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు దగ్గర మార్గం. దీంతో ఈ రోడ్డు పలు వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. తూర్పు గంగవరం నుంచి లింగాలపాడు వరకు దాదాపు అర కిలోమీటరు ఈ రోడ్డు బురదమయమైంది. మండలంలోని తోటవెంగన్నపాలెం–దోసకాయలపాడు అడ్డ రోడ్డు ఇటీవల వర్షం కారణంగా బురదమయమైంది. కనీసం నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితి. మన్నేపల్లి రోడ్డు అధ్వానంగా ఉంది. నాగంబొట్లపాలెం వాయలవాగు బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. బురదమయమై రహదారుల్లో ప్రయాణించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంత జరుగుతన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తూర్పుగంగవరం నుంచి తాళ్లూరు రోడ్డు తూతూమంత్రంగా వేశారు. దీంతో రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి మండలంలోని అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.


బురదమయమైన గంగవరం-తాళ్లూరు రోడ్డు


మట్టి రోడ్డు ప్రయాణం నరకయాతన: వర్షం కురిసినప్పుడు మా గ్రామం నుంచి తూర్పుగంగవరం ఆటోలో వెళ్లాలంటే నరకయాతనే. విద్యార్థులు, గర్భిణులు మట్టి రోడ్డులో ప్రయాణించడం కష్టంగా ఉంది.
– కె.వెంకాయమ్మ, తోట వెంగన్నపాలెం


అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలి
వర్షం కారణంగా అంతర్గత రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. అంతర్గత రోడ్ల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లను అభివృద్ధి చేయాలి.
– పేరం శ్రీనివాసరెడ్డి, మన్నేపల్లి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

యర్రగొండపాలెం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించాలని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి అన్నారు. మండలంలోని వీరభద్రాపురం, బోయలపల్లి గ్రామాల్లో పండిస్తున్న మిరప, కంది పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తే డబ్బు ఆదా అవుతుందని, నాణ్యమైన దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఖరీఫ్‌లో సాగు చేస్తున్న కంది పంటను రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి కోరారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది రమేష్, అంజినాయక్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది మద్దయ్య, మస్తాన్, శివ, నాసరయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్ మంగళవారం మండల పరిధిలోని యడవల్లి, గంటవానిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి మినుము, బత్తాయి, మొక్కజొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌లపై అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రధాన మంత్రి పసల్ బీమా, పంట నమోదు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ చైతన్యకుమార్, సంధ్యాబాయి పాల్గొన్నారు.


యర్రగొండపాలెం: మిరపపై సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న హెచ్‌వో ఆదిరెడ్డి

పెద్దారవీడు: ఒకే పంటపై రైతులు ఆధార పడకుండా మిశ్రమ పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సూచించారు. మండల కేంద్రం పెద్దారవీడు రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా ఒక పంట పోయినా మరో పంట చేతికి వస్తుందని, మిశ్రమ పంటలతో నికర లాభాలు పొందవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని, లేకుంటే భూమిలో సారం తగ్గిపోయి భవిష్యత్ తరాలకు వ్యవసాయం దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. పంటల సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. రబీలో సాగు చేస్తున్న పంటలకు రైతులు ఈ–క్రాప్ చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


పెద్దారవీడు: మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి


పెద్దదోర్నాల: హాజరైన రైతులు

కూరగాయల్లా లిక్కర్ సేల్

యర్రగొండపాలెం: ఆటోల్లో కూరగాయలు వేసుకొని వీధుల్లో కేకలు వేసుకుంటూ అమ్ముతున్నట్లు అన్నీ బ్రాండ్లకు చెందిన లిక్కర్ ఆటోలో వేసుకొని అమ్ముతున్న వైనం నియోజకవర్గంలో వెలుగు చూసింది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 94 పంచాయతీలు ఉండగా దాదాపు 197 గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు మాత్రం దాదాపు 300పైబడి ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో గ్రామానికి రెండు, మూడేసి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న కిరాణా, వీధుల్లో ఉండే బీడీ బంకులు, టీ స్టాల్స్‌కు లిక్కర్ మాఫియా మద్యాన్ని ఆటోల్లో సరఫరా చేస్తోంది. బహిరంగంగా లిక్కర్ సరఫరా చేస్తున్నా మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్న ఎక్సైజ్ శాఖాధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు. ఒక్కో క్వార్టర్ మద్యం బాటిల్‌పై ఎమ్మార్పీకంటే ఎక్కువగా రూ.20 నుంచి రూ.30 వరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అధికారిక మద్యం షాపుల్లో కూడా ఎమ్మార్పీకంటే ఎక్కువగా అమ్ముతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఉన్న 18 లైసెన్స్ షాపుల యజమానులు కూటమి ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకొని వారందరూ మండలాల వారీగా కూటమిగా ఏర్పడి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యం స్టాక్‌ను ఆటోలో లోడ్ చేయించి గ్రామాలకు పంపుతున్నారు. ఆ ఆటో వెనక కూటమి లిక్కర్ మాఫియాకు చెందిన వారు ఫాలో అవుతుంటారు. ఎవరైనా లిక్కర్‌ను అటకాయిస్తే వారిపై మాఫియా విరుచుకొని పడుతుంది. బెల్ట్‌షాపుల నిర్వాహకులు మద్యం అమ్మకాలను నిరాకరిస్తే వారు ధైర్యం చెబుతారు. ఎక్సైజ్ పోలీసులే కాదు.. లోకల్ పోలీసులు వచ్చినా మీకు ఏమీ కాదని ధైర్యం చెబుతారు. అందుకు తాము అండగా ఉంటామని చెప్తారు. లిక్కర్ మాఫియా చెప్పినట్లే ఆయా శాఖలు వ్యవహరిస్తుండటంతో బాటిళ్లను బహిరంగంగా అధిక ధరలకు విక్రయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. తమ ఇళ్ల వద్దకే లిక్కర్ వస్తుందన్న ఆనందంతో మద్యం ప్రియులు ఉంటున్నారు. ఇదేమి పోయేకాలం అంటూ మహిళలు ముక్కున వేలేసుకుంటున్నారు.


బెల్ట్ షాపునకు ఆటోలో తరలిస్తున్న లిక్కర్ బాక్స్‌లు

తాగునీటి పైప్‌నకు మరమ్మతులు


నీటి పైపు మరమ్మతుల కోసం తీసిన గుంత

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు శాఖా గ్రంథాలయం వద్ద పైపు పగిలి తాగు నీరు వృథాగా పోతున్న చోట పంచాయతీ అధికారులు మంగళవారం మరమ్మతుల కోసం కార్మికులు గుంతలు తీశారు. కొద్ది రోజుల నుంచి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని, కలుషిత నీరు తాగలేక పోతున్నామని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షి దినపత్రికలో సోమవారం అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం పేరుతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో శివాలయం వద్ద ట్యాంక్ నుంచి తూర్పుపల్లెకు వచ్చే పైపు పగిలి పోవడంతో కొద్ది రోజుల నుంచి రోడ్డు పాలవుతున్న తాగునీటిని అరికట్టేందుకు గుంతలు తీసి పనులు ప్రారంభించారు. పగిలిన పైపును తొలగించి కొత్త పైపు ఏర్పాటు చేసి మంచి నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ అధికారులు తెలిపారు. ఎన్నో రోజుల నుంచి పరిష్కారం కాని సమస్యను వెంటనే పరిష్కరించడంతో సాక్షి పత్రికకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

హెల్మెట్ లేని ప్రయాణం నేరం

దర్శి: హెల్మెట్ లేని ప్రయాణం నేరమని, ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సీఐ రామారావు, ఎస్సై మురళి సూచించారు. పట్టణంలో నేషనల్ సేఫ్టీ మంత్‌లో భాగంగా హెల్మెట్ లేకుండా మోటారు సైకిళ్లపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు మంగళవారం తగు సూచనలు, సలహాలు అందజేశారు. కంపెనీ యజమానులతో మాట్లాడి తక్కువ ధరలకు సుమారు 50 హెల్మెట్‌లను అందజేసి వాహనాలను పంపించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను గుర్తించి రేడియం స్టిక్కర్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారిస్తున్నామని చెప్పారు. సీతాకాలంలో మంచు ఎక్కువగా కురుస్తుందని, రాత్రి పూట వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే అనుభవంలో ఉన్న వారికి మాత్రమే ఆ బాధ తెలుస్తుందని, అటువంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సై బాషా, పీసీలు పాల్గొన్నారు.


హెల్మెట్‌లు అందజేస్తున్న సీఐ రామారావు

జాతీయ స్థాయి క్రీడాకారిణికి సన్మానం


వెంకట జ్యోతిని సన్మానిస్తున్న మానవత సభ్యులు

దర్శి: జాతీయ స్థాయిలో డిస్కస్ త్రోకు ఎంపికైన దొంతు వెంకటజ్యోతిని మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దేవతి ప్రసాద్, కపురం శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ వెంకట జ్యోతిని ఆదర్శంగా తీసుకుని తోటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. నేడు ఝార్ఖండ్ రాష్ట్రంలో రాంచీకి వెళ్తున్న విద్యార్థినికి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. ఉపాధ్యాయులు వాకా జనార్దన్‌రెడ్డి, పీఈటీ మాల కొండయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై దళిత నేతల ధర్నా


ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

యర్రగొండపాలెం: ఎస్సీ వర్గీకరణ సక్రమంగా జరపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల నాయకులు ధర్నా చేశారు. అధికారులు ఎస్సీలను క్రిస్టియన్‌లుగా రికార్డుల్లో నమోదు చేసి మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సచివాలయం–2 పరిధిలో 800 మంది ఎస్సీలు ఉంటే వారిలో 700 మంది క్రిస్టియన్‌లు ఉన్నట్లు నమోదు చేశారని, ఆ సచివాలయం పరిధిలో కేవలం 100 మంది మాత్రమే ఎస్సీలుగా ఉన్నట్లు గుర్తించడమేమిటని ప్రశ్నించారు. వెంటనే ప్రస్తుతం ఉన్న రికార్డులను సరిదిద్ది ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఆర్.ప్రసాద్, విల్సన్, సి.సుబ్బయ్య, లక్ష్మయ్య, అన్వేష్, జయరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్లో టీడీపీ జెండాలు

● తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న విద్యార్థులు

దర్శి: నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ హైస్కూల్లో టీడీపీ జెండాలు బాతి మరీ గొట్టిపాటి–నారపుశెట్టి మెగా క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు స్కూల్ ఉన్నప్పటికీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విద్యార్థుల క్లాసులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. యువకులు క్రికెట్ ఆడుతుంటే విద్యార్థులకు చూడాలనిపిస్తుందేగానీ చదువుకోవాలనిపించదు. దీనికి తోడు ఆటలు ఆడేటప్పుడు వచ్చే శబ్దాలు, కేరింతలు పాఠశాల విద్యార్థులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించాయి. పాఠశాలలో కొన్ని తరగతులకు పరీక్షలు కూడా జరుగుతున్నాయి. అయినా వారి భవిష్యత్ ఏమైతే మాకెందుకనుకున్నారేమో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమకు అధికారం ఉంది కదా..అని ఎటువంటి అనుమతులు లేకుండానే పాఠశాలలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఏం మెసేజ్ ఇవ్వాలనుకుంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. క్లాసులు జరుగుతుండగా క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడంపై తల్లిదండ్రులు, ప్రజలు అసహ్యించుకుంటున్నారు. దీనికి తోడు ఎస్సై మురళి టాస్ వేసి క్రికెట్ ఆడి మరీ ఆటను ప్రారంభించడం గమనార్హం. ఇదిలా ఉండగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో, గ్రౌండ్‌ల్లో ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వవద్దని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దర్శి ప్రభుత్వ హైస్కూల్లో టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన తీరు ప్రజలు ముక్కున వేలేసుకునేలా ఉంది. విద్యాశాఖ మంత్రిగా ఉన్న లోకేష్ ఆదేశాలకు విరుద్ధంగా దర్శిలో ప్రవర్తిస్తున్న తీరు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అధికారం ఉందని ఇష్టారాజ్యంగా ఏర్పాట్లు చేసుకోవడంపై ప్రజలు చీదరించుకుంటున్నారు.


దర్శి ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ జెండాలు

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష

మార్కాపురం టౌన్: ఈనెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తరం ద్వారం దర్శనం కోసం భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కమిషనర్ నారాయణరావు, అధికారులు ఆలయంలో భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామివారు శ్రీమహావిష్ణువుగా భక్తులకు ఉత్తరద్వారం ద్వారా దర్శనమివ్వనున్నారు. ఇందుకోసం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఈవో, అధికారులు